# మేల్కొన్న కోర్కెలు

భర్తవచ్చి "జానకీ!" అని పిలవగానే ఒక పిలుపు కే జానకి తలుపు తీసింది. చిరునవ్వుతో ఆహ్వానించింది. చిరునవ్వు జానకికి తరగని సంపద. భర్త కోటువిప్పి తీసి స్టాండుకు తగిలిస్తూ "ఇందాక మీకోసం జయరాం వచ్చాడండి" అంది.

భర్త భుజంగరావు మొహం ముడుచుకు పోయింది. జానకి మంద హాసానికి ప్రతిగా పెట్టిన చిరునవ్వు భంగిమరూపు లేకుండాపోయింది. ఆ మాటలు భుజంగరావు చెవుల్లో సూదుల్లా గుచ్చుకున్నాయి, గుండెకు బాణాల్లా తగిలాయి. నుదురు చకచకా ముడతలు పడింది. ముఖం పొడుగయింది.

అర్థంలేని కోపంతో టై బర్రున వూడతీసుకుంటూ "ఎందు కొచ్చాడు?" అని అడిగాడు జానకివేపు చూడకుండా.

"మీకోసం కాలేజీలో చూశారట. మీరు ప్రిన్సిపాలుగారి రూంలోనే చాలాసేపటి వరకు వుండిపోయారట. అందువల్ల కాలేజీలో కలుసుకోవడానికి వీలుపడక యింటికి వచ్చారట...." జానకి తన మామూలు ధోరణిలో చెప్పుకుపోతోంది. భర్త కాలేజీలో కష్టపడి వస్తాడుగదా యింటికి రాగానే ఆయనతో సరదాగా కబుర్లుచెప్తే ఆయన మనస్సు సంతోషిస్తుందని జానకి వుద్దేశం. అసలు సంతోషంగావుండే స్వభావం ఆమెది.

అసలు సంగతి వెంటనే చెప్పకుండా యీ కథంతా చెప్పుకుపోవుడం విని భుజంగరావు కోపం మరీ పెరిగిపోయింది. దానికితోడు జయరాం వచ్చి జానకితో ఈ కబుర్లన్నీ వల్లించడం ఎందుకా అని మండిపడుతున్నాడు.

జానకివేపు తిరిగి "ఈ పురాణం అంతా ఎవరిక్కావాలి వాడొచ్చిన పనేమిటి. ఊరికే వచ్చాడా? చూసిపోవడానికి!" అన్నాడు కడుపులో ఏదో పెద్ద మంటను కప్పి పెట్టుకుంటూ.

జానకికి భర్త చిరాకుకు కారణం అర్థంకాలేదు. అలిసి రావడం వల్ల అలా వున్నాడేమో అనుకుంది. కాఫీ యిచ్చి తర్వాత మాట్లాడవచ్చనుకుంది. కాఫీ సామాగ్రి అంతా సిద్ధంగానే వుండడంవల్ల కలుపుకు రావడానికి ఎంతోసేపు పట్టదు. "కాఫీ తీసుకువచ్చి చెప్తానుండండి"అని చకాచకా వంటింట్లోకి వెళ్ళిపోయింది. భుజంగరావు కిది అగ్గిమీద గుగ్గిలం మాదిరయింది. అసలు విషయం బయటపెట్టమంటే వంటింట్లోకి ఎందుకు పోవాలనుకున్నాడు.

మరో నిమిషానికే జానకి కాఫీ తెచ్చి అందించింది. భర్త అడగకుండానే "మీ కాలేజీ యానివర్సిరీ సెలిబ్రేషన్సు విషయం మాట్లాడాలని వచ్చాడట. సెలిబ్రేషన్సు కమిటీకి మీరు వైస్‌ప్రెసిడెంటటగా, ఇన్విటేషన్లు ప్రింటయి వచ్చాయట. బయటివాళ్లెవరెవరికి పంపించాలో

అడుగుదామని వచ్చాడట. వీలుంటే కాగితంమీద వాళ్ళ పేర్లు రాసి వుంచితే రేపు ఉదయంవచ్చి తీసుకెళ్తానన్నాడు" అని చెప్పింది భర్త కోపాన్ని చూసి భయపడుతూ.

విని వూరుకున్నాడు భుజంగరావు. కాఫీకప్పు బల్లమీద పెట్టాడు. రకరకాల ఆలోచనలు కందిరీగలై మెదడంతా తెగ కుడుతున్నాయి. జయరాంమీద కూడా పెద్దకోపం వచ్చింది.

'వాడితో బాతాకానీ కొట్టకపోతేను లేనని ఒక్క ముక్క చెప్పలేక పోయావ్! వాడు చెప్పిందేమిటో నువ్వు అర్థం చేసుకున్నదేమిటో!' అన్నాడు విషం కక్కుతున్న పాములాగా.

గులాబీపూలు పరిచివున్నట్టుగా వుండే జానకి ముఖం వాడింది భర్త ప్రారంభించిన విపరీత ధోరణికి. పాతికేళ్ళన్నా నిండని తన అమాయకపు వూహకు అందకుండా వుంది భర్త వ్యంగ్యం.

భర్త వేసిన ప్రశ్నకు ఏమని జవాబు చెప్పాలో తెలియలేదు. 'ముందే చెప్పానండి మీరు లేరని. ఈ సంగతి చెప్పమని అన్నాడు. ఇందులో అతని తప్పేముందండి' అంది.

జయరాంను వెనకవేసుకొస్తున్నట్టు అర్థం చేసుకున్నాడు భుజంగ రావు.

'నాకు తెలుసు వాడిసంగతి. నువ్వేం వాణ్ణి సమర్థించక్కర్లా. వాడు నాటకాలరాయుడు. వాడిసంగతి నాకు తెలియదా! నీసంగతి తెలియదా! ఎంతలేదన్నా సైకాలజీ ఎం.ఏ. వాణ్ణి నేను. వాడు ఇంటరు రెండుమాట్లు పల్టీకొట్టి బి.య్యేలోకి వచ్చాడు. చదువూలేదు వాడి బొందా లేదు. కమిటీలు, యసోసియేషన్లు తప్ప చదువక్కర్లా. పాతికేళ్ళబడి తెవాడు. పొట్టకోసినా అక్షరంముక్క లేకపోయినా షోకులో లోటులేదు. లేడీసు రూందగ్గర పోజులుపెడూ పచార్లు చేస్తుంటే నే చూశావాణ్ని ఒకటి రెండుసార్లు. వద్దన్న కొద్ది నన్ను ఆ కమిటీలో ఇరికించాడు. ఇప్పుడు తెలుస్తోంది వాడి రంగు. మొన్న రెండుసార్లొచ్చాడు ఏదో వంక పెట్టు

కుని. అయ్యగారు లేనిటయిములోనే వస్తున్నాడు అమ్మగారికోసం!' అవే శంతో నిప్పులు కక్కుతూ మాట్లాడుతున్నాడు. జానకి నిశ్చేష్టురాలై వింటోంది. తనని గురించి భర్త మాట్లాడేమాట విని గతుక్కుమంది.

'ఆ! ఏమిటండీ మీరివ్వాళ యిలా మాట్టాడుతున్నారు. మీ జానకి గురించేనా యింత నిష్ఠూరంగా మాట్టాడుతున్నారు. లేనిపోనిదానికి ఎందు కండి మనసు కష్టపెట్టుకుంటారు' అంది భర్తను శాంతపరుద్దామనే వుద్దేశంతో.

భర్త దగ్గరగా వెళ్ళింది మామూలు అలవాటు ప్రకారం అతని చొక్కా గుండీలు తీయడానికి. రౌద్రాకారంలో వున్న భుజంగరావు జానకి చెయ్యి తోసేశాడు.

జానకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కలువరేకులమీద నీటిబిందువుల్లా ఆమె కొలకుల్లో కన్నీరు చేరింది. మృదువైన చెక్కిళ్ళమీద నుంచి చుక్కలు చుక్కలుగా కిందపడి యింకిపోయింది. భర్త చూడకుండా పమిటితో తుడుచుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది వంటపని చూడడానికి

* * *

ఆ రాత్రి భుజంగరావు సరిగ్గా భోజనం చెయ్యలేదు. నాలుగు మెతుకులు గతికి లేచిపోయాడు. రోజూ కాసేపు ఏదో పుస్తకం చదివే వాడు. ఆ రాత్రి భోజనం అవంగానే వెళ్ళి పడుకున్నాడు. అతనికి కోపం తగ్గలేదు. వెర్రివెర్రి తలలేస్తున్నాయి భావాలు. "ఎంతో అమాయకు రాలుగా కనిపిస్తుంది జానకి. నన్ను బుట్టలో వేసుకోవడానికే యీ రంగు రంగుల వేషాలు కబుర్లూ. తియ్యగా కబుర్లు చెప్తుంది మభ్యపెట్టడానికి. నాదగ్గర సాగుతాయా యీ ఆటలు. సైకాలజీ ఎం.ఏ వాణ్ని. లెక్చరరుగావుంటూ పందల కొద్ది కుర్రాళ్ళ తత్త్వం యిట్టే పసిగడ్తున్నా. ఆ జయరాంగాడు మాట్టాడితే మా యింటికి ఎందుకు రావాలి? ఆ ఏడు పేదో కాలేజీలో చెప్పేడపకూడదూ! నేను లేని టయిముచూసి మరీ వస్తున్నాడు ఏదో సాకుతో, అందుకే నన్ను ఆ కమిటీలో ఇరికించింది.

వెధవ సెక్రటరీషిప్పు పీడూను. వీడో పెద్ద సెక్రటరీ. పైగా నాటకంలో హీరోకూడా యీ బడుద్ధాయే వేస్తాడట. వీడికితోడు ఆ ఇంటరుపిల్లొకతె. అదీ బరి తెగించింది. నాటకంలో హీరోయిను వేస్తుందట. పోన్లె వాళ్ళంతా ఎలా ఏడిస్తే నాకుపోయిందేముంది? వీడు నాకే ఎసరుపెట్టాడు. వాడేదో వచ్చాడయ్యా జానకికన్నా బుద్ధివుండక్కర్లా? వాడితో ఎందు కొచ్చిన సంభాషణ. లేరు పొమ్మంటే తీరిపోతుంది. వాడితో మాట్టాడా లని సరదా. ఇందులో ఏదో కుమ్మక్కు వుండకపోదు. వాడు రావడం యిది మూడోసారి యీ వారంలో. అసలు ఏవేం మాట్టాడుకున్నారో! జానకి పైకి చెప్పదు. కాని నా మీద దానికి అంత ప్రేమ లేదు. నేను రెండో పెళ్ళి వాణ్ణని, వయస్సు తనకన్నా చాలా ఎక్కువని యీడూ జోడూ కాదని దాని మనసులో వుంది. దాని తండ్రి దానిచేత ఎలాగో 'వూ' కొట్టించాడు అప్పుడు. జయరాంగాడు పైలాపచ్చీసుగాడు."- అని అంతూపొంతూలేని ఆలోచన్లతో గెలవలేకపోయాడు. నిద్రమత్తు ఆవరిం చింది.

జానకి కంచం దగ్గర కూర్చుని లేచింది. వంటింట్లో పని పూర్తయ్యాక తలుపులన్నీ వేసి పడకగదిలోకి వచ్చింది. భర్త యింకా కోపంగానే వుంటాడని తెలుసుకుంది. పెద్ద లైటు ఆర్పి నైట్ బల్బు వెలిగించి భర్త పక్కగా పడుకుంది మాట్లాడకుండా.

భర్త అన్నమాటలు జానకిని చాలా బాధ పెట్టాయి. అప్రయ త్నంగా ఆలోచన్లు పరుగెత్తుకొస్తున్నాయి. 'ఏ పాపం ఎరగని నన్ను యీయన ఎందుకిలా నిందించడం? ఎలాంటి చెడ్డపని చేయడం తెలియదే నాకు. ఆయన యిష్టప్రకారం నడుచుకుంటున్నందు కిదా నిందా! మా నాన్న కట్నం ఇచ్చుకోలేక రెండో పెళ్ళివాడని చూడకుండా వయస్సు ఎక్కువని సందేహించకుండా పెళ్ళి చేశారు తిండికి లోటుండదని. కాపరానికి వచ్చాను. ఆయన అదుపాజ్ఞల్లో వుంటున్నా. ఆయన వయస్సు గురించి, రెండో సంబంధం అని ఎప్పుడూ నేను బాధపడలేదు.

అయిపోయిందేదో అయిపోయింది అని అనుకున్నా. నాకు సర్వం ఆయనే అని నమ్ముకున్నా. లోగడ రెండుమూడుసార్లిలాగా ఎత్తిపొడుపుమాటలన్నారు. పోనీలే ఆయనకుమాత్రం నా సంగతి తెలియకుండావుందా అని వూరుకున్నా. ఎందుకో నామీద అనుమానం. ఏపాపం ఎరగనందుకే అనుమానం పెరుగుతోంది. ఎం.ఏ. చదువుకున్నవారు. అందులో సైకాలజీ లెక్చరరు. ఎవరో కుర్రాడు పనిమీదవస్తే నాకూ అతనికీ సంబంధం కలుపుతున్నారు. ఆ కుర్రాడు అమాయకుడులా వున్నాడు. ఆ జయరాం అలాంటివాడు కాదు. వెర్రిబాగులవాడు. అతని ఛాయ నాఛాయను మించేదిగా వుంది. దబ్బపండులా వుంటాడు. పెద్ద కుటుంబంలోవాడల్లే వుంది. గుండ్రని మొహం. మంచి కళ్ళు. తీరైన ముక్కు. ఆ బుగ్గలు ఎంత అందంగా వుంటాయి. బుగ్గమీద చక్కగా సొట్ట పడుతుంది అతను మాట్టాడుతుంటే. ఆ బుగ్గమీద ముద్దుపెట్టుకుంటె ....ఛీ ఛీ.... పాడు ఆలోచన. ఇవ్వాళ్ళిదేవిటి యిలా పిచ్చిపిచ్చి ఆలోచన్లు వస్తున్నాయి. ఎన్నడూలేంది. హాయిగా నిద్రపోయేవేళ యీ బుర్ర పగలకొట్టుకోవడవేమిటి? నిద్రరాదే యెంతకీనూ?.... నాకెందుకొచ్చిన బాధ యీదఫా ఆ జయరాం వస్తే చెప్పేస్తా ఆయన లేనప్పుడు రావద్దని. అయితే ఆమాట చెప్పటం ఎలా? అతని మొహం యిప్పుడు బాగా గుర్తుకొస్తోంది. ఏమనుకుంటాడో అతని కళ్ళల్లో దురాలోచనవున్న చూపులే లేవే? మరి యీయన అతనిమీద విరుచుకుపడడానికి కారణం? జయరాం కుర్రాడని, అందంగా వుంటాడని. అతని గుణాలు చెడ్డవిగా కన్పించడంలేదు నామటుకునాకు. చాలా వినయంగా మాట్టాడతాడు. నవ్వుతూ వుంటుంది మొహం. మనిషి మంచి దారుఢ్యత వున్నవాడు. అలా అని మోటుగా వుండడు. చిదిమి పాలు కారతాయా అన్నట్టు వుంటాడు జయరాం...’

ఎన్నెన్నో ఆలోచనలతో నిద్రపోయింది జానకి జయరాంను గూర్చి తలుచుకుంటూ—

సముద్ర తరంగాలు పందెపుగుర్రాలమాదిరి పరుగెత్తుకుంటూ

వడ్డును తాకుతున్నాయి. సాయంకాలం చల్లగాలి సముద్రంమీదనుంచి చల్లదనాన్ని సేకరించి ఒడ్డునున్న ప్రజల కందిస్తోంది. సూర్యుడు విరహ బాధతో కాంతిహీనుడై పోయిపోయి త్వరత్వరగా పశ్చిమకాంతను చేరు కుంటున్నాడు బరువెక్కిన హృదయంతో, ప్రేమోద్రేకంతో.

చిలకా గోరింకల్లా యువతీ యువకులు బీచిలో విహరిస్తున్నారు. కొందరు కూర్చుని ప్రేమసందేశాలు అందించుకుంటున్నారు. కొందరు కెరటాల కోలాహలాన్ని చూస్తున్నారు.

జానకి, జయరాం చేతులు కలుపుకుని కెరటాలతో ఆడుకుంటు న్నారు. జానకి కట్టుకున్న గులాబీరంగు సిల్కుచీర గాలికి రెపరెప కొట్టుకుంటోంది. ఎరుపు వెల్వెట్టు జాకెట్టు నారంగు కన్పడొద్దా అడ్డం లెమ్మని పమిటను తోసేస్తోంది గాలి బలంతో. గాలి తాకిడికి భయపడి చీర వక్షస్థలాన్ని అంటిపెట్టుకుంది. జాకెట్టుమీద గుండ్రని వంపుల మధ్య నెక్లేసు మెరుస్తోంది. తలలో ముడుచుకున్న మల్లెలు సౌరభాన్ని విరజిమ్ముతున్నాయి.

ప్రక్కనున్న జయరాం జానకి తలపైకి వంగి మల్లెల్ని వాసన చూశాడు. జానకి అతని బుగ్గని వ్రేలితో చిలిపిగా నెట్టింది. జయరాం ట్వీడ్ లాగూ, తెల్ల సిల్కు చొక్కా ధరించాడు. మంచి సెంటుసువాసన గుబాళిస్తోంది.

తరంగాలు వడిగా తీరం చేరుకుంటున్నాయి. పెద్దపెద్దవి వస్తు న్నాయి. ఒక పెద్ద తరంగం వచ్చింది. నీరు వెనక్కి పోయేటప్పుడు జానకి నిలదొక్కలేకపోయింది. పడతానేమోనని భయపడింది. అమాం తంగా జయరాం నడుముచుట్టూ చేయివేసి అతన్ని గట్టిగా కౌగలించు కుంది 'జయరాం!' అని అంటూ—

జానకి నిద్రలో నిజంగానే వేసిన చేయి పక్కనున్న భుజంగ రావు వీపుమీద పడింది గట్టిగా. గురక పెట్టున్న భుజంగరావు ఉలిక్కి పడి చేయి తోసేసి తిరిగి గురకసాగించాడు.

చేయి తోయంగానే జానకికి మెలుకువ వచ్చింది. కళ్లెత్తిచూసింది' కల కరిగిపోయింది. తియ్యటి స్వప్నంలో చూసిన సన్నివేశాన్ని చిత్రించుకుంటూ నిద్రపోయింది జానకి.

ఆ మర్నాటికి భుజంగరావు కోపం తగ్గిపోయింది. జానకి మనస్సు కూడా మారింది. జయరాం మనస్సులో నిల్చిపోయాడు. అతణ్ని గూర్చి మర్చిపోదామని ప్రయత్నించింది జానకి. కాని తెలియకుండానే ఆమెలో ఆలోచన్లు దొర్లుతున్నాయి. జయరాం అందచందాలు ఆమె కళ్ళల్లో మెదుల్తున్నాయి. తన భర్తను, జయరాంను పోల్చిచూసుకుంటోంది. కన్పించే తారతమ్యాలకు నవ్వుకుంటోంది. తిరిగి జయరాంను చూడాలని, అతనితో మాట్లాడాలని, అతను తనతో ఎన్నెన్నో తియ్యటి సంగతులు చెప్పాలని రకరకాలుగా వూహించుకుంటోంది, వువ్విళ్ళూరుతోంది జానకి.

జయరాంను తన హృదయంలో ప్రవేశపెట్టింది భర్తే అనుకుంటోంది జానకి. కాని తీసివేయడం ఆమెకు సాధ్యంకాకుండా వుంది.

జయరాం తిరిగి ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తోంది పెరిగిపోతున్న ఆశలతో.

*    *    *    *

ఆ నాడు ఆదివారం. సాయంత్రం సెల్రబ్రేషన్సు తాలూకు అకౌంట్సు తీసుకుని భుజంగరావు యింటికి వచ్చాడు జయరాం.

"సార్! సార్!" అని పిల్చాడు వసారాలో నుంచి.

జానకి యీ కేకవిని వచ్చి తలుపుతీసింది. ఒకచేత్తో అల్లికసూది దారం పట్టుకొని.

"భుజంగరావుగారు వున్నారండి" అని అడిగాడు.

జానకి స్వప్నంలో వున్నానా అనుకుంది. తమాయించుకుని "లేదు-లోపలకురండి" అని లోపలకు దారితీసింది.

జయరాం చెప్పులు బయటవదిలి బితుకు బితుకుమంటూ హాలులోకి వెళ్ళాడు. కుర్చీ చూపించింది జానకి. కూర్చున్నాడు.

చిరునవ్వుతో "ఆయన యీ వుదయం వూరెళ్ళారు. సైకాలజీ కాన్ఫరెన్సుకు వెళ్ళారు. తిరిగి ఎల్లుండి వుదయం వస్తారు" అంది.

జయరాం గొంతు సవరించుకుని "అయితే నేవెళ్ళొస్తానండి. సెలిబ్రేషన్సు అయిపోయాయి. వాటితాలూకు జమాఖర్చులు వారికి చూపిద్దామని వచ్చాను" అని లేవబోయాడు.

జానకి మొహంలో చెప్పరాని ఆవేదన కన్పిస్తోంది. తియ్యటి ఆశలు రేగుతున్నాయి. తన స్వప్నం కళ్ళకు కన్పించింది. ఇన్నాళ్ళు నిరీక్షిస్తున్న జయరాం తనకు ఎదురుగా వున్నాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు. కోర్కెలు బలవంత పెట్టున్నాయి జానకిని.

"ఉండండి కాఫీ తాగి వెళ్ధురుగాని" అని లేచి వంటింట్లోకి వెళ్ళి కాఫీ తెచ్చింది అయిదు నిమిషాల్లో.

జయరాంకి అందించింది. అతని చెయ్యిని కావాలని స్పృశించింది. జయరాం ఎప్పుడూ ఎరగని ఏదో అనుభూతి పొందినా పొరపాటున తగిలిందనుకున్నాడు. ఇద్దరూ కాఫీ తాగుతున్నారు.

"జయరాం! మొన్న నాటకంలో చాలా బాగా యాక్టు చేశావ్. నీకేదన్నా స్పెషల్ ప్రెజెంటు ఇవ్వాలని వుంది నాకు" అంది తడబాటును ఆపుకుని.

జానకి మాట్లాడేతీరు వింతగా తోచింది జయరాంకు. తనపేరు పెట్టి ఆమె పిలవడం యిదే తొలిసారి. ఇవ్వాళ ఆమెచూపుల్లో కొత్త సోయగం వుట్టిపడుతోంది. ఎన్నో ప్రార్థనలు కన్పడుతున్నాయి. ఎవ్వో ఆశలు జారులుగా పరుగెత్తుతున్నాయి.

అమాయకంగా నడిచే జయరాంకే ఏదో కొంత అర్థమయినట్టుగా వుంది. ఆమె తనవంక ఆశతో చూడడం గ్రహించాడు. చూపులు ఏమీ

అర్థంకాలేదు మొదట. ఎదురుగా సౌందర్యాలరాశి ఏదో సందేశం అందిస్తోంది

జానకిలో అందం జయరాం పరీక్షగా చూశాడు. చంద్రబింబంలా వుంది ఆమె వదనం. పెదవులు తేనెవాగుల్లా వున్నాయి. ఆమె శరీరంలో వంపులు సొంపులుచూసి వూహాపథంలోకి వెళ్ళిపోయాడు.

ఇద్దరూ ఒకరినొకరు చూస్తూ కొద్దిక్షణాలు ప్రతిమల మాదిరి, కూర్చున్నారు.

జయరాం ఆ పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకోలేక పోతున్నాడు.

"ఏదోలెండి, ఎమెచ్యూరు నాటకం. సరదాగా వేసింది" అన్నాడు.

జానకికి ధైర్యం వచ్చింది. "అయితే మటుకేం. నటనమాత్రం గొప్పగావుంది. నీకేం బహుమానం కావాలో చెప్పు?" అంది చిలిపిగా నవ్వుతూ.

జయరాంకూడా నవ్వాడు బాగా అర్థం చేసుకుని. ఇద్దరి కళ్ళూ మధుర సంభాషణలు చేసుకున్నాయి.

జానకి కుర్చీలోంచి లేచింది. జయరాం దగ్గరకు వెళ్ళింది చెయ్యి అందించింది. జయరాం స్వప్నలోకంలో వున్నట్టు భావించాడు. ఆమె వెంట గదిలోకి వెళ్ళాడు. రంభతో స్వర్గానికి వెళ్తున్నట్టు వూహిస్తూ.

*　　　*　　　*　　　*

భుజంగరావు కాన్ఫరెన్సు నుంచి తిరిగి వచ్చాడు. జానకితో ఆ మాటా యీ మాటా మాట్లాడుతూ "ఆ జయరాంగాడు మళ్లా వచ్చాడా!" అన్నాడు.

జానకి లోలోపల నవ్వుకుంటూ పైకి "మొన్న ఆదివారం నాడొచ్చాడు. ఏదో చెప్పబోయాడు. వినిపించుకోకుండా ఆయన్ని కాలేజీలో కలవండి వచ్చాక అన్నా. అంతే తలకాయ వంచుకుపోయాడు" అంది,

భుజంగరావు గుండెమీద బరువు దిగిపోయినట్టుగా "భలేమాట న్నావ్! మళ్ళీ యిటువేపురాడులే. అయినా వాడిబొంద. అప్పుడేదో అన్నాగానీ జానకీ! అది మనస్సులో పెట్టుకోవద్దు" అన్నాడు ప్రతిమాలు తున్న స్వరంతో.

జానకి దానికి తగిన గొంతుతో "నాకుమట్టుకు తెలియదుటండి మీ సంగతి. ఆ మాట అప్పుడే మర్చిపోయాను" అంది.

భుజంగరావుకు జానకిమీద వుండే అనుమానం పూర్తిగా తీరి పోయింది. అనురాగం పెరిగింది.

*  *  *  *

జానకి మంచి మాటకారి అయింది. అందుకే ఆమె మీద భుజంగ రావు గౌరవం యినుమడించింది.

జయరాం తరచు వస్తూనేవున్నాడు భుజంగరావు లేనిసమయాల్లో. అతను రాకపోతే జానకి వుండలేదు. అతన్ని చూడందే పట్టుమని రెండు రోజులన్నా గడపలేదు.

తను నేర్పిన పాపం భుజంగరావుకు తెలియదు. పాప మెరిగిన జానకి మాటలు నమ్మకతప్పదు. అంత చక్కటి మాటలవి. *

(1957)